క్లుప్తంగా

తహసీల్దార్‌గా వెంకటరావు నియామకం



పద్మనాభం : స్థానిక తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు పెందుర్తి బదిలీ అయ్యారు. ఎన్నికల నిబంధనల మేరకు బదిలీల్లో భాగంగా పెందుర్తి తహసీల్దార్ ఎస్.వెంకటరావును పద్మనాభం తహసీల్దార్‌గా నియమించారు. డీటీ కిశోర్ కుమర్‌ను మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఎస్‌హెచ్ - 16 విభాగంలో పని చేస్తున్న డీటీ రామలక్ష్మిని పద్మనాభం డీటీగా నియమించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం నేడు

తగరపువలస : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం ఆదర్శనగర్ - 1 సచివాలయం పరిధిలోని మీ సేవ భవనం వద్ద నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ శిబిరంలో సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని జెడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కోర్టులో ఫైలింగ్‌పై వర్క్‌షాప్

కొమ్మాది : న్యాయవిద్యను అభ్యసించే విద్యార్థులకు క్లినికల్ లీగల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో మార్చి 2 నుంచి 4వ తేదీ వరకు కోర్టు ఫైలింగ్‌పై ప్రత్యేక వర్క్‌షాప్, శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ డాక్టర్ ఆర్.అనితారావు తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థులకు ప్రముఖ న్యాయవాదులతో నైపుణ్య శిక్షణతోపాటు న్యాయపరమైన డాక్యుమెంట్లను అర్థం చేసుకుని వాటిని కోర్టుకు సమర్పించే పద్ధతులు, న్యాయ సంబంధ దరఖాస్తులపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు

తగరపువలస : ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు వెలువడినట్టు పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి పి.రాజేంద్రప్రసాద్ వర్మ తెలిపారు. 2024 జూన్ నుంచి ఆరు మాసాల్లోపు ఉద్యోగ విరమణ చేయనున్న వారందరికీ ఈ మినహాయింపు వర్తిస్తుందన్నారు. అలాగే ఎస్‌ఐ స్థాయి పోలీసులను సొంత జిల్లాల్లో బాధ్యతల్లో ఉంచరాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. అవివాహిత, వితంతు మహిళలకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరినట్టు తెలిపారు. లేదంటే సమీప నియోజకవర్గాల్లో నియమించాలని వినతిపత్రం అందించినట్టు తెలిపారు.

బీచ్‌రోడ్డులో మొక్కల పెంపకం



బీచ్‌రోడ్డులో మొక్కలు నాటుతున్న దృశ్యం

కొమ్మాది: విశాఖ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డు సుందరీకరణలో భాగంగా ఇప్పటికే కలర్‌ఫుల్ పెయింటింగ్స్, ప్రధాన కూడళ్ల వద్ద వివిధ రకాల ఆకృతులు, పలు చోట్ల బోర్డులు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వీటికితోడు సాగర్‌నగర్, రుషికొండ, తిమ్మాపురం, మంగమారిపేట, ఎర్రమట్టిదిబ్బలు ప్రధాన రహదారుల డివైడర్ల మధ్యలో మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. వీటివల్ల ప్రయాణికులు, పర్యాటకులకు మంచి అనుభూతిని కలుగుతుందని అభిప్రాయ పడుతున్నారు.

29న షాపులకు వేలం

తగరపువలస : జీవీఎంసీ 3వ వార్డు బీచ్‌రోడ్డులోని జి+1 దుకాణాలకు సంబంధించి మూడు సంవత్సరాల లీజు పరిమితితో ఈ నెల 29న బహిరంగ వేలం వేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఆ రోజు ఉదయం 11 గంటలకు నిబంధనలకు లోబడి పాల్గొనాలని జెడ్సీ కనకమహాలక్ష్మి సూచించారు. మిగిలిన వివరాలకు కార్యాలయాల పనివేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహాలు నేరం



పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో మానవహారంలో విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

పద్మనాభం : బాల్య వివాహాలు చేయడం నేరమని సమగ్ర శిక్ష అభియాన్ జీసీడీవో కాలేషా బేగం, భీమునిపట్నం ఐసీడీఎస్ పీవో శ్రీదేవి అన్నారు. బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలికలపై అఘాయిత్యాలపై పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహం చేస్తే పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. బాల్య వివాహాల వల్ల మాతా శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నిర్మూలించాలని కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు మానవ హారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నీలిమ, కస్తూర్బా విద్యాలయం స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ, సూపర్‌వైజర్ రాజ్య లక్ష్మి పాల్గొన్నారు.

టిప్పర్ లారీ ఢీ కొని వ్యక్తి దుర్మరణం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు (ఇన్‌సెట్) నాగరాజు

పీఎంపాలెం: పరదేశిపాలెం కూడలికి సమీపంలో జాతీయ రహదారిపై టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో బైకిస్ట్ మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటరావు తెలిపిన వివరాలివీ.. పరదేశిపాలెంలో కుటుంబంతో సుంకరి నాగరాజు (38) నివసిస్తున్నాడు. అతను కూలి పనులు చేస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పరదేశిపాలెం నుంచి జాతీయ రహదారిపైకి ఎక్కుతుండగా నగరం నుంచి ఆనందపురం వైపునకు వెళుతున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే క్రమంలో టిప్పర్ లారీ ముందు వెళుతున్న కంటైనర్ వాహనాన్ని కూడా ఢీకొట్టడంతో అదుపు తప్పి తుప్పల్లోకి దూసుకు పోయింది. అపస్మారకస్థితిలో ఉన్న క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెరువు నుంచి ట్యాంకర్లతో నీరు తరలింపు



కాపులుప్పాడ చెరువు వద్ద ట్యాంకర్‌లోకి నీటిని తోడేస్తున్న దృశ్యం

కొమ్మాది : జీవీఎంసీ 4 వార్డులోని మంగమారిపేట, నర్సింహనగర్, నగరపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో వేసవి వచ్చిందంటే మంచినీటి కొరత తీవ్ర స్థాయిలో ఉంటుంది. ఇప్పటికే ఈ వార్డులో పలు చోట్ల కొందరు అనధికారికంగా బోర్లు ఏర్పాటు చేసి పెద్ద పెద్ద ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు బోరు ఖర్చు లేకుండా ఓ వ్యక్తి నేరుగా కాపులుప్పాడలోని ఓ చెరువు నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమీపిస్తుండడంతో ఇప్పటికే అనేక చోట్ల బోర్లు ఎండిపోతున్నాయని, ఇప్పుడు పలువురు స్వార్థ ప్రయోజనాల కోసం చెరువును కూడా వదలకపోవడంతో భవిష్యత్‌లో తాగేందుకు నీరు దొరకదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఇక్కడ చెరువు నుంచి కొన్ని వందల ఎకరాల పంటలకు నీరు అందుతుందని, ఆ నీటిని తరలించేస్తే మా పరిస్థితి ఏంటని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

180 మందికి కంటి పరీక్షలు



ముద్దాడపేటలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ ముద్దాడపేటలో నీరజ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో సంధ్య కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో బోడమెట్టపాలెం, దాకమర్రి పంచాయతీలకు చెందిన ప్రజలు పాల్గొని సేవలు వినియోగించుకున్నారు. శిబిరాన్ని దాకమర్రి సర్పంచ్ చెల్లూరి పైడప్పడు ప్రారంభించగా ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, సర్పంచ్ ముద్దాడ అప్పయ్యమ్మ, ముద్దాడ సూరప్పడు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల రాష్ట్ర ఈసీ సభ్యుడు జీబీ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేసేందుకు సర్వే



చందకలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆనందపురం : క్షయ వ్యాధి సంక్రమించకుండా నిరోధక వ్యాక్సిన్ వేయడం కోసం ఆరోగ్య సిబ్బంది మండలంలో ఇంటింట సర్వే నిర్వహిస్తున్నారు. క్షయ వ్యాధి పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం వ్యాక్సిన్‌ను రూపొందించి సరఫరా చేయడానికి నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. 60 ఏళ్లు నిండిన వారు తమ ఇష్టానుసారం వ్యాక్సిన్ వేసుకోవడానికి ఆసక్తి ఉండి... సమ్మతి తెలియజేస్తే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అలా సేకరించిన వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తారు. వ్యాక్సిన్లు ఎంత అవసరం ఉంటాయో నివేదిక ద్వారా తెలుసుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేంద్రం సరఫరా చేయనుంది. ఈ మేరకు నెల రోజులపాటు సర్వే జరగనుంది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగునాయుడు మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారిని క్షయ వ్యాధి బారి నుంచి రక్షించడానికి సింగిల్ డోస్ క్షయ వ్యాధి వ్యాక్సిన్ వేయనున్నట్టు వెల్లడించారు. మండలంలో 24 మంది క్షయ రోగులు ఉన్నారని, వారంతా చికిత్స పొందుతున్నారని వివరించారు. వ్యాక్సిన్లు వేయించుకోవడానికి 60 ఏళ్లు నిండిన వారంతా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

29లోగా ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించాలి

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లోని 1 నుంచి 4 వార్డులకు చెందిన డీ అండ్ వోలు ఈ నెల 29లోగా ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించాలని జెడ్సీ కనకమహాలక్ష్మి సూచించారు. ఈ గడువులోగా చెల్లించని లైసెన్స్‌లపై 25 శాతం అదనపు రుసుము వసూలు చేయడంతోపాటు కమర్షియల్ విభాగం నుంచి లైసెన్స్ రద్దు చేయడానికి సిఫారసు చేయనున్నట్టు ఆమె హెచ్చరించారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు



మాట్లాడుతున్న ఎంఈవో పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శైలజ

ఆనందపురం : ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఐదేళ్లలోపు వయసున్న పిల్లందరికీ మార్చి 3న పోలియో చుక్కలు వేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.అప్పలనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.గంగునాయుడు మాట్లాడుతూ మండలంలో పల్స్‌పోలియో చుక్కలు వేయడానికి 46 సాధారణ కేంద్రాలు, సంచార జాతులు, ఇటుక బట్టీలు, పరిశ్రమల్లో పని చేసే వారి పిల్లల కోసం మరో 17 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలోపు వయసున్న పిల్లలు 4,362 మంది ఉన్నారని చెప్పారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సూచనలిచ్చామని చెప్పారు. బోని, గొట్టిపల్లి, వేములవలస, బంటుబిల్లి కళ్లాలు, చీమలమెట్టపాలెం, వెంకటాపురం తదితర గ్రామాల్లో హైరిస్క్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేములవలస బస్టాప్ వద్ద ప్రయాణికుల పిల్లల కోసం ట్రాన్సిట్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం 184 మంది సిబ్బందిని నియమించామన్నారు. శతశాతం పోలియో చుక్కలు వేయడానికి సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఐసీడీఎస్ ఏవో జి.శ్రీదేవి పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

పద్మనాభం : అందరూ సమన్వయంతో పని చేసి మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ఎంపీడీవో బి.శైలజ సూచించారు. పద్మనాభంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం పల్స్ పోలియోపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో ఐదేళ్లలోపు వయసు గల 3,200 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. 3న వేసుకోని వారిని గుర్తించి తర్వాత వేయాలన్నారు. సమావేశంలో వైద్యులు స్వప్న, కె.మణికుమారి, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజాశాంతి' పటిష్టానికి చర్యలు

మధురవాడ: మూడు శాతం ఉన్న కమ్మ సామాజిక వర్గానికి 20కి పైగా టికెట్లు, 27 శాతం ఉన్న కాపులకు తక్కువ సీట్లు ఏమిటన్న దానిపై తెలుగుదేశం పార్టీలో యుద్ధం జరుగుతోందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ అన్నారు. ప్రజాశాంతి పార్టీని మండల, వార్డు స్థాయిల్లో పటిష్టం చేయడానికి మరిన్ని చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. మారికవలస ఆర్‌జీకే కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సేవకుల సదస్సులో ఆయన మాట్లాడారు. మోదీ, అమిత్ షా అడిగినన్ని సీట్లు ఇవ్వడానికి టీడీపీ, జనసేనలు దాసోహం అయిపోయాయన్నారు. ఆపద వచ్చినప్పుడు చేతులు కట్టుకుని ఉంటే కుదరదని, సేవకులు కూడా తమను తాము రక్షించుకోవడానికి తిరగబడాల్సి ఉంటుందని పిలుపునిచ్చారు. తాను ఎంపీగా పోటీ చేస్తానని, పాల్‌తోనే మార్పు సాధ్యమవుతుందన్నారు. ఉద్యోగాలు రావాలి.. అప్పులు తీరాలి.. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థగానే ఉండాలి.. మోదీ పాలన నుంచి విముక్తి కావాలంటే పాల్ రావాలన్నారు. పార్టీ తరఫున పోటీ చేయడానికి 161 మంది దరఖాస్తు చేసుకున్నారని, గెలిచే అభ్యర్థులకే సీట్లు ఇస్తామని చెప్పారు. ఏసుపాదం, డాక్టర్ జార్జిబాబు, షామియల్ సొంబ, జాన్ మేరీ, వై.పాల్.రాజు, ఎం.హనూక్ తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్‌కు బదిలీ





ప్రదీప్‌కుమార్, డాక్టర్ హరిణి

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రదీప్‌కుమార్‌కు బదిలీ అయింది. ఆయన సాలూరు ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. అలాగే ఇక్కడ జనరల్ మెడిసిన్ డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హరిణి కేజీహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు. వీరు త్వరలో ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు చేపట్టనుండగా వారి స్థానాల్లో కొత్తవారు రావాల్సి వుంది.

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టండి

తగరపువలస : జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం - రత్నగిరి కాలనీ ప్రధాన రహదారిలో 20 రోజులుగా పైప్‌లైన్ పగిలిపోయి తాగునీరు వృథాగా పోతోంది. ఈ తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు ఇప్పటికే పలుమార్లు మధురవాడ జోనల్ కార్యాలయంతోపాటు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నా రు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

29న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 29న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



కరెన్సీ, పూలమాలల అలంకరణలో కొత్తమ్మ తల్లి



పండ్ల అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం రూ.10, రూ.100 నోట్లు, గజమాలలు, బంతి, చామంతులతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అలంకరణకు కొత్తపేటకు చెందిన రొక్కం శ్రీనివాసరావు, పుష్ప దంపతులు ఆర్థిక సహకారం అందించారు. అమ్మవారిని భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు తదితరులు అలంకరించారు.

- భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని ఆపిల్, నారింజ, ద్రాక్ష, బత్తాయి, సపోటా, దానిమ్మ, చెర్రీలతో అలంకరించారు. ఈ అలంకరణకు పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ రౌతులపాలెం, రెడ్డివారి కళ్లాలకు చెందిన సిడం పెంటయ్య, అప్పలరాజు దంపతులు సహకరించారు.

సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేయాలి



విల్సన్‌పేటలో సమావేశమైన దళిత సంఘాల నాయకులు

తగరపువలస : దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం ఆయా సంఘాల ప్రతినిధులు కార్మికవాడలోని విల్సన్‌పేట సామాజిక భవనంలో సమావేశం నిర్వహించారు. సామంతుల సత్తిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రకారం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేయాలన్నారు. ఎస్సీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం నిందితులకు బెయిల్ ఇవ్వకూడదన్నారు. దళితుల భూములు కబ్జా చేయకుండా ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు చేయాలన్నారు. నిరుద్యోగులకు స్థానిక కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కూల్చివేసిన కొండపేట అంబేడ్కర్ భవనాన్ని పునర్నిర్మించాలని కోరారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు గంధవరపు కృష్ణ, తానవరపు రవి, మామిడి వెంకట శివ, సోమి వెంకట్, టొంపల సూరిబాబు, అక్కివరపు మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో విద్యార్థులకు ఉజ్వల భవిత



కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, తదితరులు

మధురవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన కిట్స్, మధ్యాహ్న భోజనంతోపాటు ఇతర విద్యాభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్ ఉజ్వలంగా వుంటుందని విశాఖ రూరల్ మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు సూచించారు. గణేష్‌నగర్‌లోని మధురవాడ ఆర్‌హెచ్‌సీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నాడు - నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేశారని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్య అందిస్తున్నట్టు చెప్పారు. పాఠశాల కమిటీ చైర్మన్ కె.వెంకటరావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యకి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఆయన చేసిన మేలు ఎవ్వరూ మరిచిపోకూడదన్నారు.

కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకరరావు, కమిటీ సభ్యులు వందన, సత్యవతి, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

412 మందికి వైద్య పరీక్షలు



కంటి రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆనందపురం : మండలంలోని చందకలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో 412 మందిని వైద్యులు పరీక్షించారు. పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాల ప్రజలు వైద్య శిబిరానికి హాజరయ్యారు. రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈ మేరకు రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగులకు మందులు అందించడంతోపాటు వారికి ఆరోగ్య సలహాలు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి వారు ఎక్కడ వైద్య సేవలు పొందాలో వివరించారు. ఈ వైద్య శిబిరంలో ఎంపీడీవో ఎస్.అప్పలనాయుడు, సర్పంచ్ బంక శ్రీను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగునాయుడు, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధికి సైన్సే సోపానం

ఏయూక్యాంపస్: సుస్థిరమైన భవిష్యత్‌కు శాస్త్రవిజ్ఞానం దోహదపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏయూలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా జియోఫిజిక్స్ విభాగంలోని సి.వి.రామన్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పరిపాలన భవనం వద్ద విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని సైన్స్ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ.. బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడారు. యువత నిరంతర అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. యంత్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థగా నేడు ప్రపంచం మార్పు చెందుతోందని, దీనికి అనుగుణంగా యువత సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సునిశిత పరిశీలన, అవగాహన, ఆచరణ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా రంగానికి అపారమైన నిధులు, ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. కోర్సుల రూపకల్పన, ప్రయోగశాలల ఆధునీకీకరణ, ఇంటర్న్‌షిప్‌లు కల్పన, స్టార్టప్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలకు చేపడుతున్నట్లు తెలిపారు. ఎడ్‌ఎక్స్ కోర్సులను రాష్ట్ర యువతకు ఉపయుక్తంగా ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ మాట్లాడుతూ మీ వైఖరులే మీ భవిష్యత్ ప్రగతిని నిర్దేశిస్తాయన్నారు. వర్సిటీ వసతులను సద్వినియోగం చేసుకుంటూ.. ఆలోచనలకు కార్యరూపం ఇవ్వాలన్నారు. మీలోని సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 25కి పైగా పేటెంట్‌లు దాఖలు చేశామని, 82 శాతం విద్యార్థులకు గతేడాది ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఏయూలో 9 ఏళ్లకు పైగా సి.వి రామన్ విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు.